

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

**(దర్భరేవులో శ్రీనాన్నగారి ప్రవచనము, 16-7-98)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ధనంవలన, అధికారంవలన నీకు రజోగుణ స్పర్శ వస్తుంది. 24 గంటలు వంటఇంటిలో ఉంటే ఎంతో కొంత మసి అంటుకోకుండా ఎలా ఉంటుంది. అలాగే ఎంత సేపు నాకు ఇంత అధికారం ఉంది, ఇంత ధనం ఉంది అని వాటికి సంబంధించిన స్మరణ ఉన్నప్పడు రజోగుణం అంటుకొంటుంది అనిపెద్దలు చెప్పారు. ఈలోకంలో కొన్ని భోగాలు ఉన్నాయి, స్వర్గలోకంలో కొన్ని భోగాలు ఉన్నాయి. ఈలోకంలో ఉన్న భోగాలకంటే, స్వర్గలోకంలో ఉన్నభోగాలకంటే సత్పురుషుల సహవాసంవలన నీకు ఎక్కువమేలుజరుగుతుంది, శాంతి కలుగుతుంది అని భాగవతంలో చెప్పాడు. సత్పురుషుల సహవాసంవలన వచ్చే మనోవికాశము ఈలోకంలో భోగాలవలన రాదు అని చెప్పారు. సత్పురుషులతో సహవాసం చేయకపోతే ఎక్కడో మోక్షం విషయం వదిలి వేయండి. అసలు ఇన్నర్‌లైఫ్ రాదు అంటే అంతర్ దృష్టి రాదు. భక్తుడి యొక్క మనస్సును ఆత్మవైపుకు నెట్టటంకోసం, వాడికి అంతర్ దృష్టి కలుగజేయటం కోసం బాహ్యగురువు అవసరం.

దేహప్రారబ్దమును బట్టి సుఖంవస్తూఉంటుంది, దుఃఖం వస్తూ ఉంటుంది. నీకు సుఖం వస్తూ ఉన్నా, దుఃఖం వస్తూ ఉన్నా వాటి మధ్యలో ఆత్మవిద్యను నేర్చుకోవటం మర్చిపోవద్దు అని చెప్పారు. ఆత్మవిద్యను నేర్చుకొని, ఆత్మశాంతిని సంపాదించి ఆత్మశాంతిలో జీవిస్తూ దానిని ఇతరులకు ప్రసాదించగలిగితే నీ శరీరం మరణించినప్పటికి దూరానికి, దేశానికి, కాలానికి అతీతంగా నీపేరు స్మరించబడుతుంది ఈలోకంలో అని వ్యాసుడు చెప్పాడు. దేహం కాలానికి పరిమితమై ఉంటుందిగాని ప్రేమ కాలానికి పరిమితమై ఉండదు. ప్రేమ దేశకాలాలకు అతీతమైనది. దేహానికి మరణం ఉందిగాని ప్రేమకు మరణంలేదు. నీకు సుఖంవస్తూ ఉంటుంది, దుఃఖంవస్తూ ఉంటుంది. అక్కడ ఆగిపోకుండా కష్టసుఖాల మధ్యన ఆత్మవిద్యను నేర్చుకోవటానికి ప్రయత్నించు అని చెపుతున్నారు. నీకు ఎన్నిభోగాలు ఉన్నా దుఃఖం నుండి బయటపడలేవు. ఆత్మానుభవం సంపాదిస్తే నీవు దుఃఖంనుండి బయటపడతావు. నీ హృదయంలో ఉన్న మరణంలేని వస్తువు నీకు అనుభవంలోనికివస్తే దుఃఖంతో నీకు ఉన్న సంబంధం శాశ్వతంగా తెగిపోతుంది.

రాముడు కూడా లక్ష్మణుడు అరణ్యానికి వెళ్ళాడు. రాముడు ఏమి చెప్పాడు అంటే అరణ్యానికి నన్ను వెళ్ళమన్నారుగాని నిన్ను వెళ్ళమనలేదు. నేను బాధలు పడటం ఎలాగుతప్పదు నాతోపాటు నీవు బాధలు పడటంఎందుకు ? అందుచేతనీవు ఇంటికివెళ్ళిపో . అక్కడ సుఖంగా ఉండవచ్చు అనిచెప్పాడు. అప్పడు లక్ష్మణస్వామి ఏమిచెప్పాడు అంటే నీటిలోనుండి చేపను బయటపడవేస్తే అది ఎంత

గిలగిలాకొట్టుకొంటుందో, ఎంతబాధపడుతుందో నీకు నేను దూరమైతే నాకు కూడా అంత బాధ కలుగుతుంది. నన్ను అరణ్యానికి వెళ్ళమని అనకపోయినా నిన్ను విడిచిపెట్టి ఉండలేను కాబట్టి నీకూడావస్తున్నాను అని లక్ష్మణస్వామి రామచంద్రమూర్తితో చెప్పాడు. లక్ష్మణస్వామి యొక్క ప్రేమ, భక్తి చూడండి. మనకు ఈశ్వరునిపట్ల ప్రేమ కూడా అలాగ ఉండాలి. నిరంతరము మనస్సును భగవంతుని యందునిలబెట్టి ఉంచటమే తపస్సు. తపస్సు వలన మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది. అప్పుడు మనస్సు తన జన్మస్థానం వైపుకు ప్రయాణం చేయటం ప్రారంభిస్తుంది. అప్పుడు మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి కలిగితే గైడెన్స్ లోపలనుండే వస్తుంది.

ఆసక్తి, మమత, అహంభావన ఈ మూడింటిలో నుండి విడుదల పొందితే నీవు శాశ్వతశాంతిని పొందుతావు. చాలామంది వారు చేసే పని గురించి ఆలోచించరు, ఫలితం గురించి ఆలోచిస్తారు. చేతిలో ఉన్న పనిని సక్రమంగా చేద్దాము తరువాత ఏదో ఒకటి అవుతుంది అని ఉండదు. పని వదిలివేస్తారు, ఫలితం గురించి ఆలోచిస్తారు. చేసేపని పూర్ణంగాచేస్తే, చిత్తశుద్ధితో చేస్తే, శాంతితోచేస్తే మీరుసాధించలేనిది ఏదీ ఉండదు. చేసేపని సక్రమంగా చేయకుండా ఫలితం మీద ఆసక్తి పెట్టుకొంటే దానివలన నీకు దుఃఖం వస్తుంది. చేసే పని నిండుగా, హృదయపూర్వకంగా చెయ్యి. ఆసక్తి పెట్టుకోవద్దు. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదోరాదు. ఆశ ఉంటే ఆశాభంగం వస్తుంది. ఆశలేకపోతే ఆశాభంగంరాదు. మమత ఉంటే దుఃఖం వస్తుంది, భయంవస్తుంది. అహంభావన అంటే దేహానికి పరిమితమైనబుద్ధి. సాధనచేసి ఈ మూడింటిని ఎవడైతే విడిచిపెడతాడో వాడికి శాశ్వతశాంతి వస్తుంది అని భగవంతుడు చెప్పాడు.

ప్రతీమనిషికి దుఃఖం ఉంటుంది. దుఃఖాన్ని బజారుకు వెళ్ళి పోగొట్టుకోలేము, గుడి చుట్టూ తిరిగిపోగొట్టుకోలేము. నీకు దుఃఖంతో ఉన్న సంబంధాన్ని పోగొట్టేదే యోగం. మనిషి బాగుపడటానికి ఒక యోగంచాలు. కాని ఒకో మనిషికి ఒకో రకమైన ఇష్టం ఉంటుంది. అందువలన రకరకాల యోగాలు భక్తియోగం, కర్మయోగం, ధ్యానయోగం ఇలా రకరకాల యోగాలు చెప్పారు. ఒకే యోగం అందరికీ నచ్చదు. నీకు ఇష్టమైన యోగాన్ని ఆచరించి దుఃఖం నుండి విడుదల పొందు. దుఃఖం అంతా ఇంద్రియాలలో ఉంది. ఇంద్రియాలు స్వాధీనం అయ్యేకొలది దుఃఖం నశిస్తూ ఉంటుంది. యోగం అంటే కళ్ళు మూసుకోవటం, ముక్కు మూసుకోవటం అనుకొంటున్నారు. అలాకాదు మీరు ఏదైనా ఇష్టమైన వస్తువును తింటున్నారు అనుకోండి. అది ఎక్కడ ఆపుచెయ్యాలో అక్కడ ఆపు చేస్తే మీరు యోగంలో ఉన్నట్లు గుర్తు అలా ఆపకుండా మీకు ఇష్టమైనట్లు అతిగా తినేస్తే మీకు యోగంలేనట్లు గుర్తు. యోగంతో మీకు సంబంధం ఉంటే దు:ఖంతో ఉన్న సంబంధం తెగిపోతుంది. యోగంను వదిలివేస్తే దు:ఖం ఆజన్మకు ఆజన్మ పెరిగిపోతూ ఉంటుంది. కొంతమంది రాత్రి పగలు కూడా సంపాదన విషయంలో ఉంటారు. ఆహారవిషయంలో గాని, స్నేహం విషయంలో గాని, వ్యవహారం విషయంలో గాని ఏవిషయంలో అయినా అతిగా ఉంటే సారా తాగితే ఎలా మత్తువస్తుందో అలాగ మత్తువస్తుంది. అతిగా ఉంటే అది యోగంకాదు అది నీకు దు:ఖాన్ని తీసుకొనివస్తుంది.

దైనందినజీవితంలో ఆహారవిషయంలో, నిద్ర విషయంలో, వ్యవహారం విషయంలో తగు మాత్రంగా ఉండాలి, అతిగా ఉండకూడదు. మనిషి బ్రతకటానికి డబ్బు అవసరమే. అంతమాత్రంచేత డబ్బే ప్రధానం అనుకొంటే అదియోగం కాదు. భగవంతుడు చెప్పిన ప్రకారం నీ దైనందిన జీవితం తీర్చిదిద్దుకొంటే నీకు తెలియకుండానే దు:ఖంతో ఉన్న సంబంధం తెగిపోతుంది.

మేముపూజలు చేస్తున్నాము, జపాలు చేస్తున్నాము, యాత్రలు చేస్తున్నాము మాకు ఏమీరావటం లేదు అంటారు. హృదయం నిండా స్వార్థం పెట్టుకొని మీరు ఏదైనా మంచి పనులు చేస్తే పుణ్యంవస్తుంది అది అనుభవిస్తేపోతుంది అంతేకాని మీకు ఎన్నడూ వికాశం కలుగదు. మనకు సంతోషంగా ఉంది అనుకోండి రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అనుకొంటాము. దు:ఖంగా ఉంది అనుకోండి ఏమిటి మనజీవితం ఇలా ఉంది, దేవుడికి మామీద దయలేదు అనుకొంటాము. సంతోషం వచ్చినప్పడు బాగుంది అనుకొంటారుగాని సంతోషం కంటే దు:ఖమే మానవుడికి ఎక్కువ పాఠం నేర్పుతుంది అని చెప్పారు. కృష్ణుడు భగవద్గీత ఎప్పడు చెప్పాడు. అర్జునుడికి విషాదం వచ్చినప్పడు కృష్ణుడు గీతచెప్పాడు. ఆవిషాదం అర్జునుడిని కృష్ణుడు చెప్పేటీచింగ్‌కు ప్రిపేర్ చేసింది. అది మనం మర్చిపోతున్నాము. అర్జునుడికి దు:ఖం వచ్చింది అది యోగంగా మారింది. మనకు దు:ఖం వస్తే అది యోగంగామారదు మనం రోగులము అవుతాము. ఎందుచేతనంటే అర్జునుడికి దు:ఖం తనస్వంతం కోసం రాలేదు, సమాజం గురించి వచ్చింది. మనకు సమాజంగురించి దు:ఖం రాదు, మన స్వార్థం కోసం దు:ఖం వస్తుంది కాబట్టి మనకు రోగం వస్తుంది. అర్జునుడికి కూడా దు:ఖం వచ్చిన మాట నిజమేగాని అది సమాజం కోసం వచ్చింది కాబట్టి అదియోగం అయ్యింది.

గురువుతో సాంగత్యం ఒక జన్మలోనిది కాదు, ప్రతీ జన్మలోను అదికంటిన్యూ అవుతూ ఉంటుంది, నిన్ను ప్రిపేర్ చేస్తూ ఉంటాడు. ఏపని ఎప్పడు ఎక్కడ ఎలా చెయ్యాలో ఆయన చేస్తూ ఉంటాడు. ఏ సంఘటన ద్వారా నీకు పాఠం నేర్పాలో ఆసంఘటన ద్వారా పాఠం నేర్పుతాడు. ప్రతీ సంఘటనలోను గురువు ఉంటాడు అది నీకు తెలియకపోవచ్చును. ఒక జ్ఞాని ఉంటే మానవాళియావత్తు ప్రభావితులు అవుతారు. నీకు ఆత్మజ్ఞానం కలిగితే నీచుట్టూ ఉన్నవారే కాదు ఆప్రభావం సృష్టి యావత్ వ్యాపిస్తుంది మనస్సులేకుండా యాంత్రికంగా చేసే పనుల వలన జ్ఞానంరాదు. యాంత్రికంగా చేసే పనుల వలన లోకంలో నలుగురు చెప్పకొంటారు, గౌరవంవస్తుంది చివరకు జ్ఞానంసున్నా. నువ్వు సత్యాన్ని అన్వేషించు. నువ్వు సత్యాన్ని అన్వేషిస్తూ ఉంటే నీప్రయత్నం నిజమైతే నీదేహానికి ఏమికావాలో ఈశ్వరుడు సమకూరుస్తూ ఉంటాడు. మీకు ఏది కావాలో మీకంటే ఈశ్వరుడికి బాగా తెలుసు. మీరు ఎదురుచూడకండి. మీకు ఎప్పడు, ఎలా చెయ్యాలో అంతా ఆయనే చేస్తాడు, జ్ఞానంతో అలంకరిస్తాడు నీకు జ్ఞానం కలిగితే నీచుట్టూ ఉన్నవారికే ఉపయోగం అనుకోకు, సమస్తమానవాళి ఉపయోగం పొందుతుంది. కనీసం నీకు ఉన్నతమైన భావాలు, ఆలోచనలు తలంపులు వస్తూఉన్నా అవికూడా మానవ జాతి మీద పనిచేస్తాయి.

ఈశ్వరుని పట్ల సజీవమైన విశ్వాసం ఉండటంవలన నీవు ముక్తిని పొందుతావు చాపల్యం

ఉండకూడదు. కొంత మందికి విశ్వాసం ఒకరోజు ఉంటుంది మరల తగ్గిపోతుంది. దీనికి కారణం చెడుస్నేహాలు, రజోగుణ తమోగుణస్పర్శ. మనం సత్వగుణాన్ని సంపాదించటానికి ప్రయత్నం చెయ్యాలి. సత్వగుణాన్ని సంపాదించటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే భగవంతుని మీద విశ్వాసం సమానంగా ఉంటుంది. రజోగుణం వలన, తమోగుణం వలన, చెడుస్నేహాలవలన విశ్వాసం ఆరోజుకారోజు సన్నగిల్లిపోతుంది. నీహృదయంలో ఉన్న స్వేచ్ఛ నీకు కావాలంటే, శాంతి నీకు కావాలంటే ఈనామాలనుండి రూపాల నుండి, క్రియల నుండి బయటపడితే ముందు వీటి నుండి స్వేచ్ఛపొందితే ఆస్వేచ్ఛ నీకు తెలుస్తుంది, లేనిచో వెయ్యిజన్మలు ఎత్తినా ఆస్వేచ్ఛనీకు తెలియదు అని జె.కె. చెప్పారు. బయట ఉన్న రూపాలు, నామాలు, క్రియల మీదకు నీమనస్సు వెళ్ళిపోతూఉంటే నీహృదయంలో ఉన్న స్వేచ్ఛ నీకు ఎలా తెలుస్తుంది. ఎన్ని జన్మలు ఎత్తినా నీకు తెలియదు. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే వస్తువుల మీద ఉన్న శ్రద్ధ కూడా హృదయంలో ఉన్న వస్తువు మీద నీకు లేదు. సత్పురుషులతో సహవాసం చేయటం వలన సద్వస్తువును తెలుసుకోవాలనే కాంక్ష నీకు కలుగుతుంది. ఈశ్వరుడి మీద నీకు ప్రేమ లేదు అనుకో. నీకు ఈశ్వరుడి మీద ద్వేషం ఉంది అనుకో. ఈశ్వరుడి మీద ద్వేషం వలన నీవు ఈశ్వరుడిని స్మరించినా ఆయన ఎంతగొప్పవాడు అంటే ఈశ్వరుడు నిన్ను మలినంచేయడు, నిన్ను పవిత్రుడిని చేస్తాడు, నిన్ను తరింపజేస్తాడు. ఈశ్వరుడు అన్నా, ఆత్మ అన్నా, గురువు అన్నా ఒక్కటే.

ఎంతో పురోగతి సాధించిన వారు కాని, ఎంతో విశ్వాసం ఉన్నవారు గాని, అసాధారణమైన శక్తులు ఉన్నవారు గాని గురువు లేకుండా తరించలేరు. గురువు అవసరంలేదు అని ఎవరైనా భగవాన్‌తో అంటే మీకు అవసరం లేకపోవచ్చు అందరికి అవసరం లేదు అని మీరు ఎలా చెప్పగలరు అనేవారు. ఈశ్వరునితో మానసిక అనుబంధం వలన మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది. నీమనస్సు ఏమార్గం వైపుకు ఆకర్షింపబడుతోందో ఆమార్గంలోనే ప్రయాణం చెయ్యి. ఇందులో రాజీ అక్కరలేదు. ఎవరో చేసారు అని నీవు చేయవద్దు, అనుకరణవద్దు. అనుకరణ అనేది పిరికివారు చేసేపని. ఏమీసాధన చేయకుండా నిరంతరము సోమరితనానికి అలవాటుపడిపోయి ఇహానికి పనికిరాకుండా, పరానికి పనికి రాకుండా జీవించేవారిని అడుక్కుతినే వారికి అన్నగార్లు అని షేక్షిఫియర్ చెప్పాడు. మనకంటే అడుక్కొనితినేవారు మెరుగు ఎందుచేతనంటే వారు అడుక్కొనే పని అయినాచేస్తున్నారు మనం ఏపనిచేయటం లేదు. కొంతమంది ఏమిచేస్తారు అంటే వారికి దు:ఖం వస్తే అది పదిమందికి పంచిపెడతారు. వారికి సంతోషంవస్తే అది మట్టుకువారే అనుభవిస్తారు. ఈ విషయంలో స్వామివివేకానంద ఏమి చెప్పారు అంటే నీకు సంతోషం వచ్చినప్పడు రోడ్డుమీదకురా, ఆసంతోషం నలుగురికి అంటుకొంటుంది. నీకు దు:ఖం వచ్చినప్పడు ఇంటిలో పడిఉండు. రోడ్డు మీదకు వచ్చి పదిమందికి అంటించవద్దు అని చెప్పారు. మీకు రాత్రి సరిగా నిద్రపట్టటం లేదు అనుకోండి. మీకు ఏదేవుడు అంటే బాగా ఇష్టమో ఆదేవుని నామాన్ని స్మరించుకోండి, ఆదేవుని రూపాన్ని ధ్యానించుకోండి మీకు వెంటనే నిద్ర వచ్చేస్తుంది.

నీవు ఏ శాస్త్రం చదువుతూ ఉన్నా, జపం చేస్తూ ఉన్నా ధ్యానం చేస్తూఉన్నా, విచారణచేస్తూ ఉన్నా నీవు లోపల చూసుకోవలసినది ఏమిటి అంటే ఎంతవరకు హృదయంలో ఉన్న నిజం దగ్గరకు చేరుకొంటున్నావో అదిచూసుకో. అదేకొలబద్ద. నీవు ఏ డాక్టరు దగ్గరకు వెళ్లినా, ఏమందువాడుతూ ఉన్నా రోగం ఎంత వరకు తగ్గిందో చూసుకొంటావు అలాగే నీవు బాహ్యంగా ఎవరితో స్నేహంచేసినా, ఏ మార్గం అవలంభించినా, పూజచేసినా, జపంచేసినా, ధ్యానం చేసినా ఒకటి మాత్రం చూసుకో, నీ మనస్సు హృదయంలో ఉన్న నిజాన్ని అందుకొంటోందో లేదో చూసుకో. హృదయంలో ఉన్న నిజం తెలిస్తే నీకు అమృతస్థితి కలుగుతుంది, మరణాన్ని జయించి బయటకు వచ్చేస్తావు. జరిగిపోయిన సంఘటనలు అస్తమాను నీమనస్సులో మోయకుండా వర్తమానకాలాన్ని సక్రమంగా ఉపయోగించుకొంటూ భవిష్యత్‌ను బాగుచేసుకోండి. కొంతమందికి పని ఏమీ ఉండదు. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ చనిపోతారు. జరిగిపోయిన గొడవలు అన్నీ మన తలంపుకు వస్తున్నాయి అంటే అది ఈశ్వరుని మాయ అని మనకు తెలియదు. ఈశ్వరుని పాదాలను ఆశ్రయిస్తేగాని అందులో నుండి మనంబయటకురాలేము. ఏది లేదో అది ఉన్నట్లు మనకు కనిపిస్తూ ఉంటుంది అదేమాయ. మీరు జపంచేస్తూ ఉంటే, ధ్యానం చేస్తూ ఉంటే, విచారణ చేస్తూ ఉంటే ఉపయోగం లేని తలంపులు ఆగిపోతాయి. గురువు యొక్క కరుణ ఎలా ఉంటుంది అని ఒకరు భగవాన్‌ను అడిగారు. చెప్పటానికి అది మాటకు అందదు, మనస్సుకు అందదు గురువు మాత్రం ఏమి చెపుతాడు అన్నారు.

మన మనస్సు మూఢనమ్మకాల మీదకు, మూఢ విశ్వాసాల మీదకు అనాగరికమైన విషయాల మీదకు వెళ్లటానికి మానవుడిలో ఉన్న భయం కారణం అని చెప్పారు. పోలేరమ్మకు మేకను బలి ఇస్తే పుణ్యం వస్తుంది అనుకోవటానికి, మూఢనమ్మకాలే దేవుడు అనుకోవటానికి నీమనస్సులో ఉన్న భయం కారణం. జపం చేయమంటున్నారు ఎందుకు చేయమంటున్నారు? అసలు వస్తువుకు నామంలేదు, రూపంలేదు. ఈనామాలు, రూపాలు, క్రియలు ఇవి అన్నీ నీమనస్సు కల్పించినవే. నీవు రూపంతోటి, నామంతోటి తాదాప్యం పొందుతున్నావు. ఏదో ఒక అవతారపురుషునితో తాదాప్యం పొందకపోతే నీ నామం నుండి, రూపం నుండి బయటకు రాలేవు కాబట్టి ఏదో ఒక అవతారపురుషుని రూపాన్ని ధ్యానించి, నామాన్ని స్మరించుకొంటే నీ నామ, రూపముల నుండి బయటపడటానికి ఆదేవతా పురుషుడి అనుగ్రహం ఉంటుంది కాబిట్టి జపంచేయమంటున్నారు. నీకు నామం ఉంది కాబట్టి దేవుని నామంచేయమంటున్నారు. నీకు రూపం ఉంది అని అనుకొంటున్నావు కాబట్టి దేవుని రూపంధ్యానం చేయమంటున్నారు. నీకు రూపంలేదు. నామంలేదు అని అనుకొంటే ఉన్నది నీవే అని నీకు తెలిస్తే ఏమీ అక్కరలేదు.

మనం ఎక్కడ ఉన్నా మనస్సు సమానంగా ఉండాలి. అది నిజమైనస్థితి. అంతేగాని జిన్నూరులో ఉంటే ఒకలాగ, అరుణాచలంలో ఉంటే ఒకలాగ, కాశీలో ఉంటే ఒకలాగ ఉంటే అది నిజమైనస్థితికాదు. మనకు పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఒకలాగ, పరిస్థితులు వ్యతిరేఖంగా ఉంటే ఒకలాగ మనస్సు

ఉంటుంది. ఇంటిలో ఉన్నప్పుడు ఒకలాగ, వీధిలో ఉంటే ఒకలాగ ఉంటుంది. పుట్టింటిదగ్గర ఒకలాగ, అత్తవారింటి దగ్గర వేరొకలాగ ఉంటుంది. ఏ ప్రదేశంలో ఉన్నా, పరిస్థితులు ఎలాఉన్నా మనస్సు ఒకేలాగ ఉండటం తరువాత చూద్దాము. ముందు నీకున్న ధనం కంటే పవిత్రతగొప్పది అని, నీకున్న ప్రజాకర్షణ కంటే పవిత్రత గొప్పదని నీకు అర్థమయినప్పుడు కదా నీమనస్సుకు సమత్వం వచ్చేది. పవిత్రతకు ఎక్కువ శక్తి ఉంది అని తెలిస్తే కదా ఆస్థితి నీకు వచ్చేది అంటున్నారు. ఇక్కడ కొంత మంది పవిత్రులు ఉన్నారు అనుకోండి, కొందరు ధనవంతులు ఉన్నారు అనుకోండి. పవిత్రుల కంటే ధనం ఉన్నవారిని మనం బాగాచూస్తాము, వారు గొప్పవారు అనుకొంటాము. ఇదే మాయ. పరమపవిత్రులకంటే ధనం ఉన్నవారు గొప్పవారు అనుకొనే నీకు జ్ఞానమా? కాలేజీలో మాష్టారు పాఠాలు చెపుతారు. ఆకాలేజీలో చదువుకొని ఎంతో ఉన్నతమైన స్థితిలోనికి వచ్చినవారు ఉంటారు. కాని అక్కడ ఉన్న గోడలు మటుకు అలాగే ఉంటాయి. కొంత మంది జీవితాలు కూడా అంతే. మనం మంచి పనులు చేసాము అనుకోండి. లోకం సంతోషిస్తుంది గాని భగవంతుడికి అది ముఖ్యం కాదు. ఆ మంచిపని కూడా మాయలో ఒక భాగమే. ఆ మంచిపని చేసేటప్పుడు నీవు ఏ ఉద్దేశంతో చేసావు, ఏప్రేరణతో చేసావు అది చూసి నీకు ఆధ్యాత్మిక అభివృద్ధి ఇస్తాడు. ఈశ్వరుడు చూసేది పనికాదు, ఆపనిచేసేటప్పుడు దాని వెనకాల ఉన్న నీ ఉద్దేశాన్ని చూస్తాడు.

నీ మనస్సులో ఉన్నదే లోకం క్రింద మారుతుంది. లోకంలో ఉన్నదే మరల మనస్సు క్రింద మారుతోంది. ఈచక్రంలో తిరగటమేపని. చూడటానికి ఏముంది? ఎన్ని జన్మలు ఎత్తినా నీవు చూసేది ఇదే. లోపల నీహృదయగుహలో ఉన్న ఈశ్వరుని దగ్గరకు వెనకకు చూడకుండా ప్రయాణం చేసి వెళ్ళిపో. నీహృదయంలో ఉన్న సత్యవస్తువు సాక్షాత్కారం అయ్యాక, ఆ పరమసత్యం నీకు గోచరం అయ్యాక ఇంతవరకు నీవు చేసిన సాధనల మీదకు, విన్న విషయాల మీదకు కూడా నీ మనస్సు వెళ్ళదు, ఆపరమసత్యం అట్టిది. పవిత్రత కంటే ధనం, అధికారం గొప్పవి అనుకొంటాము. ఈ చిన్న విషయమే నీకు తెలియనప్పడు భగవంతుడు అంతటా ఉన్నాను అని చెపితే ఇంక నీకు ఏమి అర్థమవుతుంది.

**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 23-9-98)**

**సద్గురు శ్రీ నాన్నగారి పుట్టినరోజు**